సాక్షి అనంతపురం

ఆదివారం । 30 । జూన్ । 2024



చీనీ టన్ను రూ.19 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.19 వేలు పలికాయి.



ఇండియా బుక్‌లో నమోదు

తాడిపత్రికి చెందిన కళాకారిణులు కూచిపూడి నృత్యంలో ప్రతిభ కనబరచి ఇండియా బుక్‌లో చోటు సంపాదించడం గర్వకారణమని కలెక్టర్ పేర్కొన్నారు. 8లో

గరిష్టం/కనిష్టం
36.4°/23.8°

జిల్లాలో శనివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

అతిసార వ్యాధి నివారణకు పటిష్ట చర్యలు



వీడియో కాన్ఫరెన్స్‌లో వైద్యాధికారులకు సూచనలిస్తున్న డీఎంహెచ్ఓ భ్రమరాంబదేవి

అనంతపురం మెడికల్: అతిసార (డయేరియా) వ్యాధి నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలని వైద్యాధికారులు, తదితర సిబ్బందిని డీఎంహెచ్ఓ డాక్టర్ భ్రమరాంబదేవి ఆదేశించారు. శనివారం డీఎంహెచ్ఓ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలోని వివిధ పీహెచ్‌సీ వైద్యాధికారులతో ఆమె మాట్లాడారు. అతిసార కేసులు నమోదైన ప్రాంతాల్లో అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. పీహెచ్‌సీల్లో ఓఆర్ఎస్, ఐవీ ఫ్లూయిడ్స్ అందుబాటులో ఉంచాలన్నారు. గ్రామాల్లో పర్యటించి ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. పంచాయతీ అధికారులను సమన్వయం చేసుకుని ఓవర్‌హెడ్ ట్యాంకులను శుభ్రం చేయించాలన్నారు. జూలై 1 నుంచి ఆగస్టు నెలాఖరు వరకు అతిసార నివారణ కార్యక్రమం చేపట్టాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు.

అతిసార బాధితుల కోసం కంట్రోల్ రూం

అనంతపురం మెడికల్: డయేరియా(అతిసార)తో బాధపడుతున్న రోగుల సౌకర్యార్థం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ ఈ భ్రమరాంబదేవి తెలిపారు. వివిధ గ్రామాల్లో అతిసారతో బాధపడుతున్న వారి వివరాలను కంట్రోల్ రూంకు ఫోన్ చేసి తెలియజేయాలన్నారు. కంట్రోల్ రూం 24 గంటలూ పని చేస్తుందన్నారు. సమాచారం అందిన వెంటనే ఆయా ప్రాంతాలకు వైద్య సిబ్బందిని పంపి, మెరుగైన వైద్య సేవలందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఐటీఐ ప్రవేశాలకు రెండో విడత దరఖాస్తులు

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో ప్రవేశాలకు రెండో విడత కౌన్సెలింగ్‌కు అర్హులైన విద్యార్థులు జూలై 24లోపు దరఖాస్తు చేసుకోవాలని కన్వీనర్ రామమూర్తి కోరారు. ఈ మేరకు ఆయన శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. దరఖాస్తులు ఆన్‌లైన్‌లో మాత్రమే చేసుకోవాలని పేర్కొన్నారు. విద్యార్థులు ఏ ఐటీఐలో చేరదలుచుకున్నారో ఆన్‌లైన్‌లోనే ఎంపిక చేసుకోవచ్చన్నారు. ప్రభుత్వ ఐటీఐలలో చేరేందుకు జూలై 27, 28 తేదీల్లో, ప్రైవేట్ ఐటీఐలలో చేరేందుకు 29, 30 తేదీల్లో కౌన్సెలింగ్ ఉంటుందని వెల్లడించారు.

శిలాఫలకం ధ్వంసం



బ్రహ్మసముద్రం : భైరసముద్రం గ్రామ సచివాలయ భవన నిర్మాణ సమయంలో ఏర్పాటు చేసిన శిలాఫలకం ధ్వంసమైంది. శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు శిలా ఫలకాన్ని ముక్కలు చేసి పడేశారు. శనివారం ఉదయం సచివాలయ సిబ్బంది దీన్ని గుర్తించారు. శిలాఫలకం ధ్వంసం గురించి తమకు ఎటువంటి ఫిర్యాదూ అందలేదని పోలీసులు తెలిపారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన శిలాఫలకాలు, బోర్డులు విధ్వంసం కొనసాగుతూనే ఉంది. భైరసముద్రం గ్రామంలో శిలాఫలకం ధ్వంసం కూడా టీడీపీ కార్యకర్తల పనే అయ్యుంటుందని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

మార్కెట్‌యార్డ్ కమిటీలకు పర్సన్ ఇన్‌చార్జ్‌లు

అనంతపురం అగ్రికల్చర్: వ్యవసాయ మార్కెట్ కమిటీల పాలక వర్గాలకు గడువు ముగియడంతో పర్సన్ ఇన్‌చార్జ్‌లను నియమిస్తూ ఆ శాఖ కమిషనరేట్ నుంచి శనివారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డ్‌కు రీజనల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్జేడీ)సి. రామాంజనేయులు, హిందూపురం మార్కెట్ యార్డ్ కమిటీకి ఆర్డీడీ శ్రీకాంత్‌రెడ్డి నియమితులు కాగా.. అనంతపురం జిల్లాలో ఉన్న మిగతా యార్డ్‌లకు ఏడీఎం సత్యనారాయణ చౌదరి, సత్యసాయి జిల్లాలో ఉన్న యార్డ్‌లకు ఏడీఎం ఎల్ఎస్ మూర్తి పర్సన్ ఇన్‌చార్జ్‌లుగా వ్యవహరిస్తారు.

- ఈ నెల 4న సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. కూటమి అధికారంలోకి వచ్చింది. 5వ తేదీ ఉదయం అనంతపురం రూరల్ మండలంలోని ఓ జిల్లా పరిషత్ పాఠశాలకు వెళ్లిన టీడీపీ నేతలు 'ఇక్కడ పని చేస్తున్న నైట్ వాచ్‌మన్ రేపటి నుంచి రావాల్సిన పనిలేదు. ఆయన స్థానంలో మేము చెప్పిన వ్యక్తిని తీసుకోండి' అంటూ హెచ్ఎంను ఆదేశించారు. దీంతో చేసేదిలేక అప్పటిదాకా పని చేస్తున్న నైట్ వాచ్‌మన్‌ను ఆ మరుసటి రోజు విధుల నుంచి తప్పించారు.
- కళ్యాణదుర్గం మండల పరిధిలోని ఓ స్కూల్‌కు వెళ్లిన స్థానిక టీడీపీ నాయకులు అక్కడ పని చేస్తున్న ఆయా (మరుగుదొడ్లు శుభ్రం చేసే మహిళ)ను తప్పించాలని హెచ్ఎంకు చెప్పారు. ఆమె స్థానంలో మేము చెబుతున్న మహిళకు అవకాశం కల్పించండంటూ హుకుం జారీ చేశారు.
- శింగనమల నియోజకవర్గంలోని ఓ స్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీని వదులుకోవాలని టీడీపీ నాయకులు ఒత్తిడి చేస్తున్నారు. కాదుగీదు అంటే అనవసరంగా ఇబ్బందులు పడతారని, ఈ నెలాఖరుకు ఖాళీ చేయాలని హెచ్చరించారు. అధికార పార్టీ నాయకులకు భయపడి గార్లదిన్నె మండలంలో రెండు స్కూళ్లల్లో పని చేస్తున్నవారు స్వచ్ఛందంగా తప్పుకున్నారు.



తప్పుకోవాల్సిందే!

- ప్రభుత్వ స్కూళ్ల వాచ్‌మెన్లకు టీడీపీ హుకుం
- ప్రధానోపాధ్యాయుల ద్వారా ఒత్తిళ్లు
- మధ్యాహ్న భోజన ఏజెన్సీలపైనా కన్ను
- స్కూళ్లలో ఆయా పోస్టులనూ వదలని వైనం



అనంతపురం ఎడ్యుకేషన్: రాష్ట్రంలో అధికారం మారింది. కూటమి ప్రభుత్వం కొలువుదీరింది. ప్రభుత్వం తరఫున ఏ చిన్న పోస్టులో అయినా సరే తమకు అనుకూలమైన వారే ఉండాలని అధికార కూటమిలోని టీడీపీ నేతలు 'ముద్ర' వేస్తున్నారు. ఇందులో భాగంగానే ప్రభుత్వ స్కూళ్లల్లోని మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్న ఏజెన్సీలు మొదలుకొని నైట్ వాచ్‌మెన్లు, చివరకు మరుగుదొడ్లు శుభ్రం చేసే ఆయా పోస్టులను కూడా వదలడం లేదు. వారంతా వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉన్నవారని, వారిని తప్పించి తమవాళ్లను నియమించాలంటూ ప్రధానోపాధ్యాయులపై తీవ్రస్థాయిలో ఒత్తిడి చేస్తున్నారు. ఇప్పటికే ప్రతి నియోజకవర్గంలోనూ అధికార పార్టీ ఒత్తిళ్లు షురూ అయ్యాయి. ఎన్నో ఏళ్లుగా వాటినే నమ్ముకుని చిన్న జీతాలతో బతుకుతున్న తమ నోట్లో మట్టి కొడుతున్నారంటూ బాధితులు వాపోతున్నారు. అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లతో కొందరు తప్పుకుంటుండగా, మరికొందరు స్వచ్ఛందంగా తప్పుకుంటున్నారు. నైట్ వాచ్‌మెన్, ఆయా పోస్టుకు నెలకు రూ.6 వేల వేతనం ఇస్తున్నారు. కొన్ని స్కూళ్లలో ఇప్పటికే మార్పు చేసి జాబితాలను సిద్ధం చేసి మండల విద్యాశాఖ అధికారులకు కూడా పంపినట్లు తెలిసింది. మరికొన్ని స్కూళ్లల్లో ఈ నెలాఖరు వరకు డెడ్‌లైన్ విధించారు. ఒకటో తేదీ నుంచి తమవాళ్లు వస్తారని హెచ్ఎంలకు తేల్చి చెప్పారు. పేరెంట్స్ కమిటీల తీర్మానంతో మార్పులు, చేర్పులు చేయొచ్చు. దీంతో చాలాచోట్ల ఉన్నవారిని తప్పించి కొత్తవారిని నియమించేందుకు పేరెంట్స్ కమిటీలతో తీర్మానాలు కూడా రాయించారు.

300 ఏజెన్సీల తొలగింపు

జిల్లాలో ఇప్పటికే 300 ఏజెన్సీలను మధ్యాహ్న భోజన పథకం అమలు బాధ్యతల నుంచి తప్పించారు. 2003లో మధ్యాహ్న భోజన పథకం (ఎండీఎం) ప్రారంభమైనప్పటి నుంచి కొనసాగుతున్న ఏజెన్సీలను కూడా ప్రస్తుతం తప్పిస్తున్నారు. అప్పట్లో ఒక్క రూపాయి ఇవ్వకపోయినా నమ్ముకుని పని చేశారు. అలాంటి ఏజెన్సీలను తప్పించి అన్యాయం చేస్తున్నారని పలువురు మండిపడుతున్నారు.

సమధర్మం పాటించకుండా బయటకు..

ప్రస్తుతం పని చేస్తున్న వారిలో నిజంగా పనితీరు సక్రమంగా లేకపోతేనో, ఇంకా ఏవైనా ఆరోపణలు ఉంటేనో అలాంటి వారిని తప్పిస్తే ఎవరికీ అభ్యంతరం ఉండదు. అంతేకానీ కేవలం తమ వారికి లబ్ధి చేకూర్చేందుకు మరొకరి పొట్ట కొట్టడం ఎంతవరకు సమంజసం అని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. గత ప్రభుత్వంలో పార్టీలకు అతీతంగా అర్హులైన వారిని నియమిస్తే ఈ ప్రభుత్వం సమధర్మం పాటించకుండా బలవంతంగా బయటకు నెట్టేస్తుండడం బాధాకరమని పలువురు పేర్కొంటున్నారు.

జిల్లాలో ఎండీఎం అమలవుతున్న మొత్తం స్కూళ్లు	1,694
స్వచ్ఛంద సంస్థలు నడుపుతున్న స్కూళ్లు	112
ఏజెన్సీలు నడుపుతున్న స్కూళ్లు	1,582
నాడు-నేడు స్కూళ్లలో పని చేస్తున్న వాచ్‌మెన్లు	274
పని చేస్తున్న ఆయాలు	887

పార్టీ ముద్రతో తప్పించడం సరికాదు



ప్రభుత్వ స్కూళ్లల్లో పని చేస్తున్న నైట్ వాచ్‌మెన్లు, ఆయాలను తప్పిస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. ఇది మంచి పద్ధతి కాదు. ఎవరైనా నిజంగా తప్పులు చేసి ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి విచారణ చేసి చర్యలు తీసుకోవచ్చు. అంతేకానీ ఒక పార్టీ ముద్ర వేసి అనవసరంగా తప్పించాలని చూడడం సరికాదు. చిన్నచిన్న జీతాలతో బతుకుతున్న వారిని ఇలా ఉన్నఫళంగా తప్పిస్తే వారి జీవితాలు ఏమి కావాలి? ప్రభుత్వ పెద్దలు ఈ విషయంలో జోక్యం చేసుకోవాలి.

– విజయ్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ నాయకుడు

కలెక్టర్‌కు విన్నవించినా ఫలితం లేదు



ఉన్నఫళంగా విధుల నుంచి తప్పించే విషయమై గతంలో కోర్టుకు వెళ్లిన సందర్భంలో కమిషనర్ ప్రత్యేక ఉత్తర్వులు ఇచ్చారు. 94 జీఓను పక్కాగా అమలు చేయాలంటూ డీఈఓ కార్యాలయం నుంచి అన్ని మండల కార్యాలయాలకూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆ జీఓలను ఎవరూ లెక్క చేయడం లేదు. మధ్యాహ్న భోజన ఏజెన్సీల నుంచి మమ్మల్ని ఎందుకు తప్పిస్తున్నారో రాతపూర్వకంగా ఇవ్వాలని కోరినా పట్టించుకోలేదు. తప్పుకోకపోతే తంతామనే ధోరణిలో అధికార పార్టీ నేతలు వ్యవహరిస్తున్నారు. వీరి ఆగడాలపై కలెక్టర్‌కు విన్నవించినా ఫలితం లేదు.

–ఎం.నాగమణి, మధ్యాహ్న భోజన పథకం కార్మికుల అసోసియేషన్ అధ్యక్షురాలు

8న హాస్టళ్లు పునఃప్రారంభం

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం క్యాంపస్ కళాశాలల్లో పీజీ తరగతుల నిర్వహణపై నీలినీడలు కమ్ముకున్నాయి. వాస్తవానికి జూలై 1 నుంచి ప్రారంభం కావాల్సిన తరగతులు 8కి వాయిదా పడ్డాయి. దీంతో హాస్టళ్లు సైతం అదే రోజు నుంచి పునఃప్రారంభించాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో శనివారం పీజీ తరగతులు, హాస్టళ్ల నిర్వహణపై వార్డెన్ ప్రొఫెసర్ చిట్టా సురేష్ అధ్యక్షతన డిప్యూటీ వార్డెన్ల సమావేశం నిర్వహించారు. యూనివర్సిటీలో నీటి ఎద్దడి నెలకొన్న నేపథ్యంలో హాస్టళ్లు ప్రారంభిస్తే విద్యార్థుల ఆందోళనలు కట్టడి చేయలేమని అధికారులు పేర్కొన్నట్లు తెలిసింది. సమస్యలు పరిష్కరించేంత వరకు వాయిదా వేయడం ఉత్తమమనే అభిప్రాయానికి వచ్చారు. పంగల్ రోడ్డు వద్ద ఎస్కేయూ యాజమాన్యం తవ్వించిన బోరు బావుల నుంచి ప్రత్యేక పైపులైన్ ద్వారా క్యాంపస్‌కు నీటి సరఫరా చేస్తున్నారు. అయితే నాలుగు లేన్ల రోడ్డు నిర్మాణ సమయంలో పైపులైన్ తొలగించిన కాంట్రాక్టర్ కొత్త పైపులైన్ వేయడంలో నిర్లక్ష్యం వహించారు. దీంతో క్యాంపస్‌కు నీటి సరఫరా నిలిచిపోయింది. కొత్త పైపులైన్ పునరుద్ధరించాలని కాంట్రాక్టర్‌ను పలు దఫాలు కోరినప్పటికీ స్పందించలేదని అధికారులు వాపోయారు. వారం రోజుల్లోపు సమస్య పరిష్కరించుకోవాలని అధికారులు భావిస్తున్నారు. కాంట్రాక్టరు స్పందించి పైపులైన్‌ను పునరుద్ధరిస్తే విద్యార్థులకు తరగతులు, హాస్టళ్లు అందుబాటులోకి రానున్నాయి. అప్పటి దాకా తరగతుల నిర్వహణ వాయిదా అనివార్యం అని అధికారులు బాహాటంగానే పేర్కొంటున్నారు.

పింఛన్ల పంపిణీ పకడ్బందీగా చేపట్టాలి

అనంతపురం అర్బన్: జూలై ఒకటో తేదీన ఎన్టీఆర్ భరోసా కింద పింఛన్లు పకడ్బందీగా పంపిణీ చేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. మొదటి రోజే 100 శాతం పంపిణీకి చర్యలు తీసుకోవాలన్నారు. పింఛన్ల పంపిణీ అంశంపై సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్ శనివారం విజయవాడ నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి తగిన సూచనలు ఇచ్చారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం పింఛన్ల పంపిణీపై అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఒకటో తేదీ ఉదయం 6 గంటల నుంచి కచ్చితంగా పింఛన్ల పంపిణీ మొదలు కావాలని ఆదేశించారు. పంపిణీ సక్రమంగా జరుగుతోందా లేదా అని మండల ప్రత్యేక అధికారులు తనిఖీ చేయాలన్నారు.

విద్యుత్ అక్రమంగా వినియోగిస్తే చర్యలు

- విద్యుత్ శాఖ విజిలెన్స్ ఎస్ఈ శ్రీనివాసబాబు



తనకల్లులో పరిశ్రమను తనిఖీ చేస్తున్న విజిలెన్స్ ఎస్ఈ శ్రీనివాసబాబు

అనంతపురం టౌన్: సర్వీస్ కనెక్షన్ లేకుండా విద్యుత్‌ను అక్రమంగా వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవని విద్యుత్ విజిలెన్స్ ఎస్ఈ శ్రీనివాసబాబు హెచ్చరించారు. శనివారం ఉమ్మడి జిల్లాలోని కదిరి, అనంతపురం డివిజన్లలో విజిలెన్స్ అధికారులతో కలిసి తనిఖీలు నిర్వహించారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ పొంది.. దాంతో పరిశ్రమలకు నీటిని వినియోగిస్తున్న నిర్వాహకునిపై కేసు నమోదు చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ లేకుండా ఐదు కంటే ఎక్కువ విద్యుత్ సర్వీసులు తీసుకున్నట్లు విచారణలో బయట పడడంతో మరో 4 కేసులు పెట్టారు. అనంతరం ఎస్ఈ కార్యాలయంలో విజిలెన్స్ అధికారులతో ఎస్ఈ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసబాబు మాట్లాడుతూ విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న వారిపై గట్టి నిఘా ఉంచాలన్నారు. కొత్తగా మంజూరు చేస్తున్న విద్యుత్ కనెక్షన్లపై క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. అక్రమంగా విద్యుత్ కనెక్షన్లు తీసుకున్నట్లు విచారణలో బయటపడితే మంజూరు చేసిన అధికారితోపాటు కనెక్షన్ పొందిన వినియోగదారులపై సైతం కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. 5 విద్యుత్ సర్వీసులు దాటితే కచ్చితంగా ట్రాన్స్‌ఫార్మర్‌ను వినియోగదారుడు ఏర్పాటు చేసుకునే విధంగా చూడాలన్నారు. ఇష్టారాజ్యంగా విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేయడంతో గృహ విద్యుత్ వినియోగదారులు లో ఓల్టేజీ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాంటి సమస్యలకు తావులేకుండా నిక్కచ్చిగా అధికారులు విధులను నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారులు గోపీ, రామాంజనేయులు, నాగేంద్ర, అల్లీపీరా పాల్గొన్నారు.

జిల్లాకు విచ్చేసిన ఎన్నికల వ్యయ పరిశీలకులు



ఎన్నికల వ్యయ పరిశీలకులు నితిన్‌అగర్వాల్, రాందాస్ టి.కాలే, విలాస్ వి.షిండేలకు పుష్ప గుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల ఎన్నికల ఖర్చు పరిశీలన కోసం ఎన్నికల వ్యయ పరిశీలకులు నితిన్ అగర్వాల్, రాందాస్ టి.కాలే, విలాస్ వి.షిండే శనివారం జిల్లాకు విచ్చేశారు. అనంతపురం ఆర్అండ్‌బీ అతిథి గృహంలో విడిది చేసిన వారిని కలెక్టర్ వినోద్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు తమ వ్యయానికి సంబంధించి తుది అకౌంట్లు వ్యయపరిశీలకులకు సమర్పించాలన్నారు. అభ్యర్థులు తమ అకౌంట్ల పరిశీలన పూర్తి చేసుకోవాలని సూచించారు. ఏవైనా సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవాలని చెప్పారు.

రైతులకు నాణ్యమైన ఎరువులను అందించండి



ఎరువుల తయారీ యూనిట్‌ను పరిశీలిస్తున్న డీఏఓ ఉమా మహేశ్వరమ్మ

రాప్తాడు: రైతులకు నాణ్యమైన ఎరువులను అందించాలని జిల్లా వ్యవసాయాధికారి(డీఏఓ) ఉమా మహేశ్వరమ్మ ఎరువుల తయారీదారులకు సూచించారు. శనివారం అనంతపురం పంగల్ రోడ్డులోని ఎంవీ బయలాజికల్ బయోఫర్టిలైజర్స్, బయో పెస్టిసైడ్స్ తయారీ కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా పరిశీలించారు. ల్యాబ్, రిజిష్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి మాట్లాడుతూ నిబంధనలు పాటించి నాణ్యమైన ఎరువులను తయారు చేయాలని తయారీదారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎరువులలో ఏ మాత్రం నాణ్యత ప్రమాణాలు తగ్గినా, రైతుల నుంచి ఫిర్యాదులు వచ్చినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ కార్యాలయ టెక్నికల్ ఏఓ బాలానాయక్, అనంతపురం ఏఓ శశికళ, ఏఈఓలు మురళీకృష్ణ, అలేఖ్య పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 4,254 కేసుల పరిష్కారం



లోక్ అదాలత్ నిర్వహిస్తున్న దృశ్యం

అనంతపురం: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శనివారం నిర్వహించిన జాతీయ మెగా లోక్ అదాలత్‌లో 4,254 కేసులకు న్యాయమూర్తులు పరిష్కారం చూపారు. అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో 26 బెంచులు నిర్వహించారు. ఫిర్యాదుదారులు రాజీకి సమ్మతించడంతో 707 క్రిమినల్ కేసులు, 69 సివిల్ కేసులు, 26 మోటారు వాహన ప్రమాద పరిహార కేసులు, 3,452 ప్రిలిటిగేషన్ కేసులు పరిష్కారమయ్యాయి. ప్రమాదభరిత కేసులలో కక్షిదారులకు పరిహారం కింద రూ.1,97,80,000 ఇప్పించడమే కాకుండా రాజీ మార్గంలో పరిష్కరించారు. సివిల్ కేసుల్లో రూ.56,63,000, ప్రిలిటిగేషన్ కేసుల్లో రూ.33,32,871 పరిహారం కింద ఇప్పించారు. ఇన్‌చార్జ్ జిల్లా జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు సి.సత్యవాణి, కార్యదర్శి జి.శివ ప్రసాద్ యాదవ్ పర్యవేక్షించారు.

అప్పుడే మొదలెట్టారు!

- ఖాళీ స్థలాలపై టీడీపీ కన్ను
- ఉప్పరపల్లి రవిదాస్‌కాలనీలో పేదల రేకుల షెడ్లు ధ్వంసం

రాప్తాడు రూరల్: అధికారంలోకి వచ్చీ రాగానే టీడీపీ చోటామోటా నాయకులు అనంతపురం రూరల్ మండలంలో ఖాళీ స్థలాలపై కన్నేశారు. ఏ గ్రామంలో చూసినా సెంటు భూమి రూ.లక్షలు పలుకుతోంది. ఈ క్రమంలో ప్రభుత్వ భూముల్లో పాగా వేసేందుకు పావులు కదుపుతున్నారు. ఉప్పరపల్లి పొలం సర్వే నంబర్లు 211, 215 పరిధిలోని రవిదాస్‌కాలనీలో పేదలు వేసుకున్న రేకుల షెడ్లను శనివారం కొందరు టీడీపీ నాయకులు జేసీబీతో ధ్వంసం చేయడం చర్చనీయాంశమైంది. ఈ కాలనీలో 11 ఏళ్ల కిందట 400 మంది పేదలు బండలతో కూడిన రేకుల షెడ్లు వేసుకున్నారు. చాలామంది ఇక్కడే జీవనం సాగిస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులతో కొందరు పక్కా ఇళ్లు నిర్మించుకోలేదు. అక్కడక్కడా ప్లాట్లు ఖాళీలున్నాయి. అలాంటి వాటిని కబ్జా చేసేందుకు టీడీపీ నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో మూడు షెడ్లను ధ్వంసం చేశారు. బండలను పగులగొట్టి విధ్వంసం సృష్టించారు. కాగా ఇక్కడి షెడ్లకు పేదలు ఏటా ఇంటి గుత్తలు కూడా కడుతున్నారు. అయితే ఈసారి గుత్తలు కట్టించుకోవద్దని పంచాయతీ అధికారులపై టీడీపీ నాయకులు ఒత్తిడి చేసినట్లు తెలిసింది. ఇదిలాఉండగా గుడిసెల ధ్వంసం ఘటనపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.





రవిదాస్ కాలనీలో పేదలు వేసుకున్న రేకుల షెడ్లను టీడీపీ నేతలు జేసీబీతో ధ్వంసం చేయించిన దృశ్యం

క్లుప్తంగా

నెట్టికంటుడి సన్నిధిలో ఎస్పీ గౌతమిశాలి



జిల్లా ఎస్పీ గౌతమిశాలికి స్వామి తీర్థ ప్రసాదాలను అందజేస్తున్న ఆలయ సిబ్బంది

గుంతకల్లు రూరల్: జిల్లా ఎస్పీ గౌతమిశాలి శనివారం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి వారిని దర్శించుకున్నారు. వేకువజామునే ఆలయానికి చేరుకున్న ఆమెకు ఆలయ అధికారులు, అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ఎస్పీ కుటుంబ సభ్యుల తరపున స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు ఆమెకు స్వామివారి ఆశీర్వచనాలతోపాటు తీర్థప్రసాదాలు, పట్టువస్త్రాలను అందజేశారు.

గుర్తింపు కార్డుల కోసం దరఖాస్తు చేసుకోండి

అనంతపురం రూరల్: జిల్లాలో హిజ్రాలు గుర్తింపు కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఏడీ అబ్దుల్ రసూల్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ధ్రువీకరణ ప్రతం, గుర్తింపు కార్డు కోసం http;//tranrfender.dorje.gov.in వెబ్‌సైట్ లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఆధార్‌కార్డు లేని ఆధార్ సేవా కేంద్రాల్లో తమ వివరాలను అందజేసి కార్డులు పొందాలని కోరారు. వివరాలకు 08554-232380 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీల్లో ప్రతిభ



రుతికేతన్‌రెడ్డికి ప్రశంసాపత్రాన్ని అందిస్తున్న దృశ్యం

అనంతపురం: జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీలు అశోక్ నగర్‌లోని ఇండోర్ స్టేడియంలో జరుగుతున్నాయి. జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో కే.రుతికేతన్‌రెడ్డి సత్తా చాటాడు. అండర్-13 విభాగంలో సింగిల్స్, డబుల్స్‌లో ప్రతిభ చాటి టోర్నీలో విజేతగా నిలిచాడు. ఈ సందర్భంగా జిల్లా బ్యాడ్మింటన్ సంఘం ఉపాధ్యక్షుడు కే. మహమ్మద్ షఫీ, ప్రతాప్‌రెడ్డి, ఓం జయకుమార్, అజీజ్ తదితరులు రుతికేతన్ రెడ్డిని అభినందించారు.

అవిశ్రాంతమా!

- ఈసారి ఒకరోజు ముందుగానే సేవలకు సెలవు
- నేడు ప్రభుత్వ ఉద్యోగుల విరమణ దినోత్సవం



అనంతపురం కల్చరల్: ఉద్యోగం చాలామందికి జీవనాధారం..మరికొందరికి ప్రజాసేవకు అందివచ్చిన అవకాశం. ఏదేమైనా తమ సర్వీసులో ప్రభుత్వం తమకు అప్పజెప్పిన బాధ్యతలను భుజస్కందాలపై మోసి కాలం తీరగానే రిటైర్ అవుతుండడం చాలామందికి హాయినిచ్చే అంశమే. విశ్రాంతి పొందడం ద్వారా కుటుంబంలో నిర్వర్తించాల్సిన పనులను వేగవంతం చేయడానికి అనువైన సమయం. ఈ నేపథ్యంలోనే ఏటా జూన్ 30న 'ఉద్యోగ విరమణ దినోత్సవం'గా జరుపుకుంటున్నాం. ఈసారి నెలాఖరు సెలవుదినం కావడంతో ఒకరోజు ముందుగా అంటే శనివారమే నగరంలో అనేకమంది రిటైర్ అయి పాత బాధ్యతలను వదిలి కొత్త బాధ్యతలను చేపట్టనున్నారు. ఒకసారి గతాన్ని తలుచుకుంటే కొన్ని ఆవేదనలు, అసంతృప్తులు ఉన్నట్టే మరచిపోలేని తీయని జ్ఞాపకాలూ.. అందంగా పలకరిస్తాయి. తమ అపార అనుభవం కుటుంబ సభ్యుల కోసమే కాదు సమాజహితం కోసమని.. భవిష్యత్తులో సమాజసేవకు తమ వంతు సాయమందించాలని తెలియజేసేందుకే ఈ రోజున ఉద్యోగ విరమణ దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు.

వ్యాపకమంటూ ఉంటేనే ప్రశాంతత..

ఉద్యోగం చేసినన్నాళ్లు క్షణం తీరిక లేకుండా ఎంతో బిజీగా గడిపిన తాము ఉద్యోగ విరమణ తర్వాత ఏం చేయాలన్నది పాత తరం వారికి శేష ప్రశ్నగా మిగిలిపోయేది. ఇప్పటి వారు ముందుగానే తమ లక్ష్యాన్ని నిర్దేశించుకుంటున్నారు. అయ్యో.. మొన్న చేరినట్టుంది అప్పుడే ఉద్యోగ జీవితం అయిపోయిందా..అనుకునే వారి సంఖ్య క్రమంగా తగ్గిపోతోంది.. కారణం రాజకీయ ఒత్తిడులతో దినదిన గండంగా మారుతున్న ఉద్యోగాల కంటే తొందరగా రిటైర్ అయి స్వేచ్ఛాయుత జీవితం గడపాలనుకున్నవారు అధికంగా ఉన్నారన్నది ఎక్కువగా వ్యక్తమవుతున్న అభిప్రాయం. ఉద్యోగ విరమణ ఒంటరితనం అనారోగ్యం బారిన పడనీకుండా వ్యాపకమంటూ ఒకటుండాలని అనుభవజ్ఞులంటుంటే జాతి నిర్మాణంలో తమ వంతు పాత్ర నిర్వహించి సంతృప్తిని మిగుల్చుకుని హాయిగా శేషజీవితాన్ని ఆస్వాదిస్తామని మరికొందరంటున్నారు.

ఆరోగ్యకరమైన బిజీ పెట్టుకోవాలి



మాది చెన్నేకొత్తపల్లి మండలం సమీపంలోని ముష్టికోవెల గ్రామం. ఉపాధ్యాయునిగా పలుచోట్ల పని చేసి దాదాపు మూడు దశాబ్దాల కిందట ఉద్యోగ విరమణ చేశాను. ఆర్థిక ఒత్తిళ్లు, ఒంటరితనం భయపెట్టకుండా కాస్తంత ప్రణాళికబద్ధంగా వ్యవహరిస్తూ కుటుంబ సభ్యుల ఇష్టాలను గౌరవించినపుడు ఎటువంటి సమస్య ఉత్పన్నమవదు. ఆరోగ్యకరమైన బిజీగా ఉండడం వల్లే జీవితం సమయమంటూ తెలీకుండానే గడచిపోతుంది.

– కరణం ఆదిశేషప్ప, విశ్రాంత ఉపాధ్యాయుడు

అనేక ఒడిదుడుకులు చూశా



నా 38 ఏళ్ల సర్వీసులో అనేక ఒడిదుడుకులు చూశా. ఎన్నో ఒత్తిళ్ల భరించాను. అయితే నా పరిధిలో చాలా మందికి ఉపయోగపడినాననే అనుకుంటున్నా. గతేడాది ఉత్తమ ఉద్యోగిగా జిల్లా అధికారుల చేతుల మీదుగా ప్రశంసలందుకోవడం ఆనందంగా ఉంది. నాకు ముగ్గురు ఆడపిల్లలు. అందరికీ పెళ్లి చేసేశాను. ఇక శేష జీవితం ఆనందంగా గడపడానికి కుటుంబానికి ఎక్కువ సమయమిస్తూనే సమాజానికి నా వంతు సేవ చేయాలనుకుంటున్నాను.

– వేణుగోపాల్, వైద్యారోగ్య శాఖ

సంతృప్తికరంగా విధులు



నేను 2007లో నగరపాలక సంస్థలో కారుణ్య నియామకం కింద ఉద్యోగంలో చేరాను. 18 ఏళ్ల సర్వీసు మొత్తం ఎంతో సంతృప్తికరంగా సాగిపోయింది. నగరపాలక సంస్థలో రెవెన్యూ విభాగం అంటే పబ్లిక్ రిలేటెడ్ పోస్టు కాబట్టి అందరినీ సమన్వయం చేసుకుంటూ అంకితభావంతో పనిచేశాను. అధికారులు కూడా ఎంతో గౌరవంగా చూశారు. నాకు ఒకే కొడుకు అతనికి పెళ్లయిపోయింది. ఇక విశ్రాంత జీవితం ప్లాన్ చేసుకోవాలి.

– పద్మలత, నగరపాలక సంస్థ

క్రీడాకారులకు చేయూతనందిస్తా



పోలీసు శాఖలో 40 ఏళ్లు పలుచోట్ల పని చేశా. నేను స్వతహాగా క్రీడాకారున్ని కావడంతో అనేక సార్లు జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నా. ఆ అనుభవంతోనే ఎంతో మందికి బాస్కెట్‌బాల్, వాలీబాల్ వంటి వాటిల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నా. ఉద్యోగ విరమణ తర్వాత మరింతగా సేవలందించాలనుంది. పోలీసుగా ఉన్నప్పటికీ ఆధ్యాత్మికంగా ఉన్నందున ఎంతో మంది కష్టాల్లో ఉన్నవారికి సాయమందించే అవకాశం నాకీ ఉద్యోగం వల్ల వచ్చింది.

– బాలరామారావు, ఎస్‌ఐ

'గేట్స్'లో డ్రోన్ తయారీ యూనిట్



గరుడా ఏరోస్పేస్ కంపెనీతో ఎంఓయూ కుదుర్చుకుంటున్న గేట్స్ యాజమాన్యం

గుత్తి: పట్టణ శివారులోని గేట్స్ ఇంజనీరింగ్ కాలేజీలో త్వరలో డ్రోన్ తయారీ యూనిట్‌ను ప్రారంభించనున్నట్లు కళాశాల ఎండీ రఘునాథ్ రెడ్డి శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెన్నైకు చెందిన గరుడా ఏరోస్పేస్ సంస్థతో ఎంఓయూ కుదుర్చుకున్నామన్నారు. డ్రోన్ యూనిట్ ప్రారంభానికి అవసరమయ్యే స్థలంతో పాటు సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఈ యూనిట్‌లో వ్యవసాయ సంబంధిత డ్రోన్‌లు తయారు చేస్తారన్నారు. కళాశాల ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ విద్యార్థులు డ్రోన్ తయారీపై శిక్షణ, ఇంటర్న్‌షిప్‌లు, సర్వీస్‌లు చేపట్టే అవకాశముంటుందన్నారు. కళాశాల కరస్పాండెంట్ వీకే పద్మావతమ్మ, డైరెక్టర్ వీకే వాణి, ప్రిన్సిపాల్ డాక్టర్ సురయ, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ తన్వీర్, ఏఓ ఇంతియాజ్ పాల్గొన్నారు.

గుత్తి వాసి దుర్మరణం

ప్యాపిలి: వెంగళాంపల్లి- వెంకటాంపల్లి మార్గంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అనంతపురం జిల్లా గుత్తి వాసి దుర్మరణం చెందాడు. గుత్తికి చెందిన ధనుంజయ (30), పామిడికి చెందిన శివయ్య బైక్‌పై బేతంచెర్ల మండలం మద్దిలేటి స్వామి దర్శనానికి వెళ్లారు. దర్శనం అనంతరం తిరిగి వెళ్తుండగా వెంగళాంపల్లి వద్ద గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ధనుంజయ అక్కడికక్కడే మృతి చెందాడు. శివయ్యకు కాలు విరగడంతో డోన్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పంచాయతీరాజ్ ఎస్‌ఈ ఎవరు?

- నేడు ఎస్‌ఈ ఈరాస్వామి ఉద్యోగ విరమణ
- ఇంకా కొలిక్కిరాని ప్యానల్
- ఎస్‌ఈ నియామకంపై సందిగ్ధం



అనంతపురంలోని పంచాయతీరాజ్ శాఖ కార్యాలయం

అనంతపురం సిటీ: జిల్లా పంచాయతీరాజ్ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్(ఎస్‌ఈ)గా ఎవరొస్తారనే విషయం అంతుబట్టడం లేదు. ఇప్పుడున్న ఎస్‌ఈ ఎం.ఈరాస్వామి ఆదివారం ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈ నేపథ్యంలో కొత్తగా ఎస్‌ఈ ఎవరొస్తారో తెలియడం లేదు. ప్రస్తుతం జిల్లాలో పని చేస్తున్న ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ల(ఈఈలు)కే ఏమైనా ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగిస్తారా లేక రెగ్యులర్ ఎస్‌ఈని నియమిస్తారా అనేది ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

ప్రాజెక్ట్ ఈఈ కేవీకేవీ ప్రసాద్‌కేనా?

ప్రస్తుత ఎస్‌ఈ ఈరాస్వామి ఆదివారం ఉద్యోగ విరమణ చేయనుండడంతో శుక్రవారంలోగానే(రెండ్రోజులు ముందు) రెగ్యులర్ లేదా ఇన్‌చార్జ్ నియమిస్తూ ఉత్తర్వులు జారీ కావాల్సి ఉంది. అయితే ఈసారి అటువంటి పరిస్థితి కనబడలేదు. శనివారం నాటికి కూడా ఎస్‌ఈ ఎవరనే అంశానికి సంబంధించి ఉత్తర్వులు అందలేదు. అయితే ప్రాజెక్ట్ ఈఈ కేవీకేవీ ప్రసాద్ జిల్లాలోనే సీనియర్. ఆయన కూడా మరో నాలుగు నెలల్లో రిటైర్డ్ కానున్నారు. ఆయనకే ఎస్‌ఈ బాధ్యతలు కూడా అదనంగా ఇచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. మరోవైపు క్వాలిటీ విభాగం ఈఈ కూడా తన వంతు ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు శాఖలో చర్చ నడుస్తోంది.

ఇంకా కొలిక్కిరాని ప్యానల్

రాష్ట్ర వ్యాప్తంగా ఆదివారం ఒక్క రోజే ఆరేడు జిల్లాలకు చెందిన పీఆర్ ఎస్‌ఈలు ఉద్యోగ విరమణ చేయనున్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పడి నెల రోజులే కావడంతో ఇంకా ఐఏఎస్‌ల బదిలీలే కొలిక్కిరాలేదు. పై స్థాయిలో ఐఏఎస్‌ల సర్దుబాటు పూర్తయ్యాకే పాలన పూర్తిస్థాయిలో గాడిలో పడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో పీఆర్ ఈఎన్‌సీ.. పదోన్నతుల జాబితా(ప్యానల్ లిస్ట్) సిద్ధం చేసుకున్నట్లు ఆ శాఖలో చర్చ జరుగుతోంది. ఈ ప్రక్రియ పూర్తయ్యేసరికి కనీసం రెండు నెలలు పడుతుందంటున్నారు. అప్పటి వరకు ఆయా జిల్లాల్లో సీనియర్ ఈఈలకు ఎఫ్‌ఏసీ బాధ్యతలు అప్పగించే అవకాశాలు ఉన్నాయని చర్చ నడుస్తోంది.

కోట్లాది రూపాయల పనులపై ప్రభావం

రెగ్యులర్ ఎస్‌ఈని జాప్యం లేకుండా నియమించాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. దీంతో వాటిపై ప్రభావం పడే అవకాశాలు లేకపోలేదని అంటున్నారు.

హమ్మయ్యా... గండం తప్పింది!

- కేజీబీవీ కాంట్రాక్ట్ ఉద్యోగుల రీ-ఎంగేజ్‌మెంట్ ఉత్తర్వుల జారీ
- ఫెర్ఫార్మెన్స్ పాయింట్స్ 35 శాతం కంటే తక్కువ ఉన్నా రెన్యూవల్

అనంతపురం ఎడ్యుకేషన్: కేజీబీవీల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ టీచర్లకు గండం తప్పింది. ఎట్టకేలకు 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి రీ-ఎంగేజ్‌మెంట్ ఉత్తర్వులు జారీ కావడంతో ఊపిరి పీల్చుకున్నారు. 35 శాతం కంటే తక్కువ ఫెర్ఫార్మెన్స్ పాయింట్స్ ఉన్నా రెన్యూవల్‌కు అనుమతించారు. రెండు రోజుల కిందట సమగ్ర శిక్ష ఎస్పీడీ శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. గతం కంటే మెరుగైన ఫలితాలకు కృషి చేసేలా సమ్మతితో తిరిగి ఉద్యోగం కొనసాగించేలా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఏళ్లుగా పని చేస్తున్న సీఆర్టీలను ఇలా ఫెర్ఫార్మెన్స్ పాయింట్ల పేరుతో మానసికంగా బాధపెడుతున్నారంటూ పలువురు వాపోతున్నారు. పదో తరగతి, ఇంటర్ ఫలితాల ఆధారంగా పాయింట్లు నమోదు చేశారని చెబుతున్నారు. సెలవులు ఎక్కువగా వాడినా పాయింట్లలో కోత ఉంటుందని చెబుతున్నారు. రోజూ ఉదయం 9 గంటలకు యాప్‌లో అటెండెన్స్ వేయాల్సి ఉంటుంది. ఒక నిముషం ఆలస్యమైనా లేట్‌గా చూపిస్తుంది. 16 లేట్‌లు వచ్చి ఉంటే '0' మార్కులుగా చూపించారని వాపోతున్నారు. అలాగే 6 నుంచి 9వ తరగతి వరకు విద్యార్థుల ఫెర్ఫార్మెన్స్ బట్టి టీచర్లకు మార్కులు కేటాయించారని చెబుతున్నారు. స్థానికంగా నివాసం ఉంటే కొన్ని మార్కులను కేటాయిస్తారన్నారు. మొత్తంగా 100 మార్కులకు కుదించి 35 మార్కులలోపు వచ్చిన వారిని ఉద్యోగాల నుంచి తొలగించేలా గతంలో ఉత్తర్వులు జారీ చేశారంటూ వాపోతున్నారు. ఏడాదంతా పని చేసి ఇలా ఫెర్ఫార్మెన్స్ పాయింట్లు అంటూ ముందుకు తీసుకురావడం ఎంతవరకు సమంజసమని ఉద్యోగులు వాపోతున్నారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి




విద్యార్థిని హర్షశ్రీకి పురస్కారం అందిస్తున్న అతిథులు, స్నాతకోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

- జేఎన్‌టీయూ ప్రతినిధి ఆచార్య శివకుమార్, ఆలూరు సాంబశివారెడ్డి
- ఘనంగా ఎస్‌ఆర్‌ఐటీ స్నాతకోత్సవం

శింగనమల: విద్యార్థులు సృజనాత్మకతను అలవర్చుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జేఎన్‌టీయూ విశ్వవిద్యాలయం ప్రతినిధి ఆచార్య శివకుమార్ సూచించారు. బుక్కరాయసముద్రం మండలం రోటరీపురంలో ఉన్న ఎస్‌ఆర్‌ఐటీ కళాశాలలో శనివారం కరస్పాండెంట్ ఆలూరు సాంబశివారెడ్డి అధ్యక్షతన కళాశాల రెండో స్నాతకోత్సవం(ఉద్భవాన్-2024) ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆచార్య శివకుమార్ మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి కళాశాల, దేశం, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు పురస్కారాలు అందజేశారు. రామానుజన్ ఉత్తమ పురస్కారం, ఆలూరు నారాయణమ్మ స్మారక పురస్కారం ఈసీఈ విభాగానికి చెందిన లింగుట్ల రజిత, ఆలూరు స్మారక పురస్కారం అదే విభాగం విద్యార్థి నల్లబయ్యన్న గారి చెన్నకేశవరెడ్డి, ఆలూరు పుల్లారెడ్డి స్మారక పురస్కారం మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థి గుట్టికట్టి ఆదిల్ అందుకున్నారు. సివిల్ ఇంజనీరింగ్‌లో జమ్ములమడుగు సల్మా, సీఎస్‌డీలో పేరం భార్గవి, సీఎస్‌ఈలో కల్లుకురి వైష్ణవి, సీఎస్ఎంలో గొందిరెడ్డి విమల, ఈఈఈ విభాగంలో దూలం కుసుమ పురస్కారాలు దక్కాయి. వీరితో పాటు 2024లో ఉత్తీర్ణత సాధించిన వివిధ విభాగాల విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బాలకృష్ణ, టీపీఓ రంజిత్‌రెడ్డి, వివిధ విభాగాధిపతులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.


రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



మృతుడు పవన్

కనగానపల్లి: కొండపల్లి గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. కంబదూరు మండలం తిప్పేపల్లికి చెందిన పవన్‌కుమార్(30) శుక్రవారం రాత్రి వారి స్వగ్రామం నుంచి అనంతపురానికి బైక్‌పై బయలుదేరాడు. కొండపల్లి సమీపంలోని ఓ మలుపు వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పటంతో అతను రహదారి పక్కన గుంతల్లోకి పడి తీవ్రంగా గాయపడ్డాడు. రాత్రి వేళల్లో ఈ విషయాన్ని ఎవ్వరూ గమనించకపోవటంతో అక్కడే మృతి చెందాడు. శనివారం ఉదయం ఆ రహదారి వెంట వెళ్తున్న వాహనదారులు గుర్తించి వెంటనే పోలీసులకు, మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడు బోరు వాహనం డ్రైవర్‌గా పనిచేసేవాడు. ఇతనికి భార్య వాణి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆర్‌బీకేలు ఇక రైతు సేవా కేంద్రాలు



వైఎస్సార్ రైతు భరోసా కేంద్రం

అనంతపురం అగ్రికల్చర్: గత ప్రభుత్వం గ్రామ, గ్రామాన రైతుల కోసం ఏర్పాటు చేసిన వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలు ఇక నుంచి రైతు సేవా కేంద్రాలుగా పనిచేయనున్నాయి. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు వ్యవసాయ శాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ తెలిపారు. ఆర్‌బీకే ఛానల్‌ను పాడిపంటలు ఛానల్ గా, అదే విధంగా ఆర్‌బీకే మ్యాగజైన్లను కూడా పాడిపంటలు మ్యాగ్‌జైన్లుగా పేర్లు మార్పు చేశారన్నారు. వ్యవసాయ సలహా మండలిని రద్దు చేస్తూ ఉత్తర్వులు వచ్చాయన్నారు.

రాష్ట్రస్థాయి అండర్-13 బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక



ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న క్రీడాకారిణి ముస్కాన్

తాడిపత్రి అర్బన్: రాష్ట్రస్థాయి అండర్-13 బ్యాడ్మింటన్ పోటీలకు తాడిపత్రికి చెందిన ముస్కాన్ అనే క్రీడాకారిణి ఎంపికైంది. శనివారం జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లా స్థాయి అండర్-13 బ్యాడ్మింటన్ సింగిల్స్, డబుల్ విభాగాల్లో విజయం సాధించి రాష్ట్ర స్థాయి అండర్-13 చాంపియన్‌షిప్‌కు ఎంపికైనట్లు బ్యాడ్మింటన్ కోచ్ రవికుమార్ తెలిపారు. ఉమ్మడి అనంత జిల్లా వ్యాప్తంగా 64 మంది పోటీ పడగా ముస్కాన్ సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో విజేతగా నిలిచిందన్నారు. ఆగస్టులో విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి చాంపియన్ షిప్ పోటీలకు అర్హత సాధించిందని కోచ్ వివరించారు.

ఇండియా బుక్‌లో నమోదు గర్వకారణం

- కూచిపూడి కళాకారిణులకు కలెక్టర్ అభినందన

అనంతపురం అర్బన్: తాడిపత్రికి చెందిన కూచిపూడి నృత్యంలో ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదు కావడం జిల్లాకే గర్వకారణమని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ప్రశంసించారు. కలెక్టర్‌ను శనివారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో తాడిపత్రి పట్టణంలోని వందన డ్యాన్స్ అకాడమీకి చెందిన కూచిపూడి కళాకారిణులు సాయి మైత్రి, జ్యోషిత, వర్షిణి, నవ్య, సాహిత్య, నిహారిక కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని కేదార్‌నాథ్ వద్ద మైనస్ 2 డిగ్రీల ఉష్ణోగ్రతలో కూచిపూడి నృత్యం చేయడం చాలా గొప్ప విషయమన్నారు. భవిష్యత్తులో మరింత ఉన్నతస్థాయికి చేరుకుని మరిన్ని రికార్డులు సాధించాలంటూ ఆశీర్వదించారు. అకాడమీకి చెందిన కూచిపూడి నృత్య గురువు వందన భర్త ప్రవీణ్ మాట్లాడుతూ మే 13న తాడిపత్రి వందన డాన్స్ అకాడమీకి చెందిన ఆరుగురు కళాకారిణులు కేదార్‌నాథ్ ఆలయం వద్ద మైనస్ 2 డిగ్రీల చలిలో ఉదయం 7 నుంచి ఉదయం 8.30 గంటల వరకు కూచిపూడి నృత్యం ప్రదర్శించారన్నారు. దీంతో వీరి నృత్యం ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదైందన్నారు. ఈమేరకు సర్టిఫికెట్ అందుకున్నామన్నారు. భవిష్యత్తులో కైలాస పర్వతం (మౌంట్ కైలాస్) వద్ద కూచిపూడి నృత్యాన్ని ప్రదర్శించేందుకు తాము సన్నద్ధమవుతున్నామన్నారు. కార్యక్రమంలో డీఎస్‌డీఓ షఫీ పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచండి


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ నరసింహారెడ్డి

ఆత్మకూరు: బడిఈడు పిల్లలు ఎక్కడైనా బయట ఉంటే వెంటనే వారి తల్లిదండ్రులతో మాట్లాడి పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈఓ నరసింహారెడ్డి ఉపాధ్యాయులను ఆదేశించారు. ప్రతి పాఠశాలలోనూ విద్యార్థుల శాతాన్ని పెంచాలన్నారు. శనివారం మండలంలోని పలు పాఠశాలను ఎంఈఓ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రభుత్వం నుంచి వచ్చిన విద్యా సామగ్రిని అందజేశారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలని ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. అనంతరం పలు పాఠశాలల్లో విద్యార్థుల తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో ముఖాముఖి అయ్యారు. బోధన తీరు..పాఠశాలల్లోని సమస్య గురించి అడిగి తెలుసుకున్నారు.

రేపు 'నిత్య నవనీతం' పుస్తకావిష్కరణ

అనంతపురం కల్చరల్: సీనియర్ కవి నబిరసూల్ రాసిన 'నిత్యనవనీతం' సుభాషితం పుస్తకావిష్కరణ జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం 5 గంటలకు నగరంలోని పాధ్యాయభవన్‌లో జరగనుంది. ఇందుకు సంబంధించిన వివరాలను సంఘం నాయకులు వెల్లడించారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత బండి నారాయణస్వామి, ఆచార్య బాలసుబ్రహ్మణ్యం, ప్రముఖ నాట్యాచార్యులు సంధ్యామూర్తి తదితరులు ముఖ్య అతిథులుగా హాజరవుతారు. సాహితీ, కళాభిమానులు విచ్చేసి పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

లిఫ్ట్‌కు మోక్షమెప్పుడో?


ఆర్థో విభాగంలో పని చేయని లిఫ్ట్

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రి ఆర్థో విభాగంలో లిఫ్ట్ పని చేయక రోగులు ఇబ్బంది పడుతున్నారు. ఈ విభాగంలో రోగులను శస్త్రచికిత్సల కోసం మొదటి ఫ్లోర్‌లో ఉన్న థియేటర్‌కు తీసుకెళ్లాలి. అదే బ్లాక్‌లో మేల్ మెడిసిన్, ఫీమేల్ మెడిసిన్, ఐసీసీయూ విభాగాలు ఉన్నాయి. ఈ మూడు విభాగాల్లో 200 మందికి పైగా రోగులు అడ్మిషన్‌లో ఉంటారు. వారిని చూసేందుకు పెద్ద సంఖ్యలో రోగి సహాయకులు వస్తుంటారు. మొదటి, రెండో అంతస్తుకు వెళ్లాలంటే రోగులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఏపీఎంఎస్ఐడీసీ అధికారులు చొరవ తీసుకుని లిఫ్ట్‌ను వినియోగంలోకి తేవాలని రోగులు కోరుతున్నారు.

చిన్నారులకు ఆహ్లాదమేదీ?


చిన్నపిల్లల వార్డులో మూతపడిన ఆట గది

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని చిన్నపిల్లల వార్డులో పిల్లల ఆహ్లాదం కోసం ఏర్పాటు చేసిన ఆట గది మూతపడింది. జ్వరం, తదితర జబ్బులతో చికిత్స పొందుతున్న చిన్నారులు ఏడ్చినపుడు ఓదార్చడానికి, త్వరితగతిన కోలుకోవడానికి అనువుగా ప్రత్యేకంగా ఆట స్థలం ఏర్పాటు చేశారు. ఇది చిన్నారులకు ఎంతగానో ఉపయోగపడింది. అలాంటి గదిని ప్రస్తుతం మూసేశారు. ఇప్పటికైనా ఆస్పత్రి అధికారులు స్పందించి ఆట గదిని వినియోగంలోకి తెస్తారో లేదో చూడాలి.



ఆట గదిలో బ్యాటరీలో ఉంచిన దృశ్యం

సర్వ రోగ నమోదిని అభా


అభా యాప్‌లో వివరాలు నమోదు చేస్తున్న నర్సింగ్ విద్యార్థినులు


ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య ఖాతా రిజిస్ట్రేషన్ చేస్తున్న విద్యార్థిని

అనంతపురం సర్వజనాస్పత్రిలో వైద్యం కోసం వచ్చే రోగులు తొలుత ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య ఖాతా (ఏబీహెచ్‌ఏ-అభా) రిజిస్ట్రేషన్ చేయించుకుంటేనే ఓపీ టికెట్ ఇస్తున్నారు. అభా కార్డులో వివరాలతో పాటు రోగి చరిత్ర నిక్షిప్తమై ఉంటుంది. దేశంలో ఏ ప్రభుత్వాస్పత్రికి వెళ్లినా ఈ కార్డు నంబర్ ఎంటర్ చేస్తే రోగి గత చరిత్ర.. డాక్టర్లు అందించిన వైద్యం గురించి వివరాలు తెలుస్తాయి. అభా రిజిస్ట్రేషన్ కోసం రోగులు గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోంది. నర్సింగ్ విద్యార్థుల ద్వారా 'అభా' రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టేలా అధికారులు చర్యలు తీసుకున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

కార్మికులపై కక్ష సాధింపు వద్దు

• ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌బాబు



విలేకరులతో మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌బాబు

అనంతపురం అర్బన్: కార్మికులపై కక్ష సాధింపు ధోరణిని అధికార పార్టీ నాయకులు వీడాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎం.రమేష్‌బాబు అన్నారు. తమ సమస్యల పరిష్కారం, హక్కుల సాధన కోసం కార్మికులు పోరాటాలు చేస్తారన్నారు. అలాంటి వారికి రాజకీయాలతో ముడిపెట్టి తొలగించాలనే ఆలోచన సరికాదన్నారు. అనంతపురం విచ్చేసిన రమేష్‌బాబు శనివారం ఏఐటీయూసీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు రాజేష్‌గౌడ్, వర్కింగ్ అధ్యక్షుడు కృష్ణుడుతో కలసి విలేకరులతో మాట్లాడారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, స్కావేంజర్లు, హాస్టల్ వర్కర్లు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులకు రాజకీయాలతో ముడిపెట్టి విధుల నుంచి తొలగించాలనే ఆలోచనను అధికార పార్టీ నాయకులు, ప్రభుత్వం మానుకోవాలన్నారు. కార్మికులు చాలీచాలని వేతనంతోనే పనులు చేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారన్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా సమస్యల పరిష్కారానికి పోరాటాలే కార్మికులకు ఆయుధమన్నారు. అంతే తప్ప ఎవ్వరికీ రాజకీయాలతో సంబంధం ఉండదన్నారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికులను తొలగించే ఆలోచన మానుకుని, వారికి వేతనం, మెస్ చార్జీలు పెంపుదల చేయాలన్నారు. స్కావేంజర్లు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, హాస్టల్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. అదే విధంగా వేతనం పెంచాలన్నారు. పార్ట్‌టైం ఉద్యోగులను ఆప్కాస్‌లో విలీనం చేసి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కార్మికులకు అన్యాయం జరిగితే తాము ముందుండి పోరాటాలు సాగిస్తామన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి


వార్షిక మహాసభలో మాట్లాడుతున్న మేరి వటమట్టమ్

చెన్నేకొత్తపల్లి: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని పలువురు వక్తలు అన్నారు. మండల కేంద్రంలోని టింబక్టు కలెక్టివ్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న ఆదిశక్తి సొసైటీ 27వ వార్షిక మహాసభను శనివారం స్థానిక సంస్థ కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. సొసైటీ అధ్యక్షురాలు అశ్వర్థమ్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా టింబక్టు కలెక్టివ్ సంస్థ చైర్మన్ గంగూలీ, సెక్రటరీ మేరీ వటమట్టమ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మేరీ వట్ట మట్టమ్ మాట్లాడుతూ, ఆదిశక్తి సొసైటీ 3 మండలాల పరిధిలోని 90 గ్రామాల మహిళలతో కలసి పని చేస్తోందన్నారు. మహిళలను పొదుపు సంఘాల ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా సొసైటీ సహకారం అందిస్తోందన్నారు. అదేవిధంగా నాయకత్వ లక్షణాలపై అవగాహన కల్పించడంతో పాటు మహిళల్లో చైతన్య తీసుకువస్తోందన్నారు. ఆదిశక్తి సొసైటీ సీఈఓ కవిత వార్షిక నివేదికను, సొసైటీ చేపడుతున్న కార్యక్రమాల గురించి సభ్యులకు వివరించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. మహాసభకు పలు గ్రామాల నుంచి మహిళలు భారీ సంఖ్యలో తరలివచ్చారు.

జూలై 12 వరకు దరఖాస్తుకు తుది గడువు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలో 1994–95 నుంచి 2014–15 విద్యా సంవత్సరం వరకు డిగ్రీ కోర్సుల్లో బ్యాక్‌లాగ్ పడిన సబ్జెక్టులు పూర్తిచేయడానికి చివరి అవకాశం కల్పించారు. ఇందులో భాగంగానే ఫెయిలైన సబ్జెక్టులు పూర్తి చేయడానికి గత రెండు నెలల కిందట నోటిఫికేషన్ జారీ చేశారు. అయితే విద్యార్థుల వినతి మేరకు దరఖాస్తు గడువును పొడిగిస్తూ మరో నోటిఫికేషన్‌ను శనివారం జారీ చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ తెలిపారు. దరఖాస్తుకు జూలై 12 తుది గడువుగా నిర్దేశించారు. రూ.1000 అపరాధ రుసుంతో జూలై 19 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఒక్క పేపర్‌కు రూ.2 వేలు, రెండు పేపర్లకు రూ.3 వేలు, రెండు సబ్జెక్టులు అంత కంటే ఎక్కువ ఫెయిల్ అయి ఉంటే రూ.4 వేలు చొప్పున పరీక్ష ఫీజు నిర్ణయించారు.

వైద్య కళాశాల హాస్టల్‌లో చోరీ



సీసీ కెమెరాలో రికార్డయిన దొంగ కదలికలు

అనంతపురం: నగరంలోని ప్రభుత్వ వైద్య కళాశాల మెన్స్ హాస్టల్‌లో శనివారం ఉదయం చోరీ జరిగింది. ఉదయం 6 గంటలకు మెడికోలు జిమ్‌కు వెళ్లే సమయంలో ఒక దొంగ డాక్టర్ లాగా వైట్ కోటు వేసుకొచ్చి ఒక గదిలోకి ప్రవేశించి ల్యాప్‌టాప్, ట్యాబ్, సెల్ ఫోన్‌తో ఉడాయించాడు. ఇదంతా సీసీ కెమెరాలో రికార్డయ్యింది. ప్రిన్సిపాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు టూ టౌన్ సీఐ క్రాంతి కిరణ్ తెలిపారు.

ఇంటి పన్ను రూ.5 లక్షల వసూలు

అనంతపురం కార్పొరేషన్: నగరంలో ఇంటి పన్ను బకాయిలు రూ.5లక్షలు వసూలైంది. మొండి బకాయిదారులకు నగరపాలక సంస్థ రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేసి, కోర్టులో కేసు ఫైల్ చేసిన విషయం విదితమే. ఈ క్రమంలో శనివారం కోర్టులో సంబంధిత అసెస్‌మెంట్‌దారులు హాజరయ్యారు. వారు చెల్లించాల్సిన పన్ను బకాయిలను చెక్కు, తదితర రూపంలో చెల్లించారు. కోర్టుకు హాజరైన వారిలో అదనపు కమిషనర్ శ్రీహరిబాబు, ఆర్‌ఓ సతీష్, న్యాయవాది ఉమాపతి, అసెస్‌మెంట్‌దారులు, తదితరులున్నారు.

మీ సేవలు మరువలేనివి


రామాంజనేయులు దంపతులను సన్మానిస్తున్న దృశ్యం


నరసింహులు దంపతులను సన్మానిస్తున్న అధికారులు, పాఠశాల సిబ్బంది


ఉద్యోగ విరమణ చేసిన వారిని సన్మానిస్తున్న మేయర్ వసీం


సూర్యప్రకాష్‌రెడ్డి దంపతులను సన్మానించిన డీఎంహెచ్‌ఓ భ్రమరాంబదేవి

• పదవీ విరమణ పొందిన ఉద్యోగుల సేవా నిరతిని కీర్తించిన వక్తలు

ప్రతి ఉద్యోగికీ పదవీ విరమణ తప్పదని, కానీ విధుల్లో ఉన్న సమయంలో వారు చేసిన సేవలే వారికి శాశ్వత గుర్తింపునిస్తాయని వక్తలు అన్నారు. శనివారం పలువురు ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు పదవీ విరమణ పొందగా, ఆయా కార్యాలయాల్లో వారిని ఘనంగా సన్మానించారు.

గ్రామీణ విద్యార్థుల భవితకు బాటలు

కనగానపల్లి: తెలుగు పండితుడు చాగంటి నాగేంద్రరెడ్డి చేసిన సేవలు ఎనలేనివని మామిళ్లపల్లి జిల్లా పరిషత్ పాఠశాల హెచ్ఎం స్నేహలత కొనియాడారు. మండలంలోని మామిళ్లపల్లి జెడ్పీ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న నాగేంద్రరెడ్డి శనివారం పదవీ విరమణ పొందారు. స్థానిక పాఠశాలలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం మాట్లాడుతూ...తన ఉద్యోగ జీవితంలో నాగేంద్రరెడ్డి గ్రామీణ ప్రాంతాల విద్యార్థుల భవితకు బాటలు వేశారని కొనియాడారు.

రామాంజనేయులు సేవలు మరవలేనివి

ఆత్మకూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ అడెండర్‌గా పని చేస్తున్న రామాంజనేయులు సేవలు మరువలేనివని ఎంపీపీ హేమలత, ఎంపీడీఓ దశరథరామయ్య అన్నారు. శనివారం రామాంజనేయులు పదవీ విరమణ సందర్భంగా స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో రామాంజనేయుల దంపతులను శాలువా, పూల మాలలతో సత్కరించారు. 43 ఏళ్లుగా రామాంజనేయులు అంకిత భావంతో పనిచేశారన్నారు. చేసిన కార్యక్రమంలో ఈఓఆర్డీ దామోదర్‌రెడ్డి, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది శివశంకర్, జయరాం పాల్గొన్నారు.


సన్మానం అందుకున్న నాగేంద్రరెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు

నరసింహులు సేవలు అభినందనీయం

రాప్తాడు: ఉపాధ్యాయుడిగా నాలుగున్నర దశాబ్దాలుగా ఎంతో మంది భవితకు బాటలు వేసిన బుటారి నరసింహులు సేవలు అభినందనీయమని, ఉపాధ్యాయ లోకానికి ఆయన సేవలు ఆదర్శనీయమని పాఠశాల విద్య రీజనల్ జాయింట్ డైరెక్టర్ రాఘవ రెడ్డి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం బుటారి నరసింహులు పదవీ విరమణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి పాఠశాల విద్య రీజనల్ జాయింట్ డైరెక్టర్ రాఘవరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విధి నిర్వహణలో కష్టపడి పనిచేస్తే సమాజంలో తగిన గుర్తింపు ఉంటుందన్నారు. నరసింహులు పని చేసిన ప్రతిచోట విద్యాభివృద్ధికి, పాఠశాలల అభివృద్ధికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. అనంతరం ఎంఈఓ మల్లికార్జున మాట్లాడారు. ఈ సందర్భంగా నర్సింహులు దంపతులను దుశ్శాలువ, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచు సాకే తిరుపాలు, టీడీపీ మండల కన్వీనర్ పంపు కొండప్ప, ఉపాధ్యాయులు సాంబశివ, సాయి ప్రసాద్, అర్షద్, గోపాల్ రెడ్డి, రోజా రమణి, రాజేశ్వరి, సుధామణి, పీడీలు కేశవమూర్తి, రాజశేఖర్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

సూర్యప్రకాష్‌రెడ్డి సేవలు మరువలేనివి

అనంతపురం కార్పొరేషన్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో డిప్యూటీ పారామెడిక్ ఆఫీసర్ సూర్యప్రకాష్‌రెడ్డి చేసిన సేవలు మరువలేనివని డీఎంహెచ్‌ఓ భ్రమరాంబదేవి పేర్కొన్నారు. శనివారం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) కాన్ఫరెన్స్ హాల్‌లో సూర్యప్రకాష్‌రెడ్డి ఉద్యోగ విరమణ సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. కుష్ఠు వ్యాధి విభాగంలో 40 ఏళ్లుగా సూర్యప్రకాష్‌రెడ్డి సేవలందించారని కొనియాడారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ అనుపమ జేమ్స్, డాక్టర్ సుజాత, డాక్టర్ యుగంధర్, డాక్టర్ రవిశంకర్, డాక్టర్ గంగాధర్‌రెడ్డి, డాక్టర్ శివారెడ్డి, ఓబులు, విశ్రాంత డీఎంహెచ్‌ఓ రామసుబ్బారావు, ఏఓ గిరిజా మనోహర్, పీఏఓ నాగన్న, హెచ్ఈఓ సత్యనారాయణ, డెమో ఉమాపతి, డిప్యూటీ డెమో త్యాగరాజు, గంగాధర్, ఎంపీహెచ్ఈఓ లక్ష్మణ్ణ పాల్గొన్నారు.

ఉద్యోగుల పాత్ర కీలకం

అనంతపురం నగరాభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకమని మేయర్ వసీం అన్నారు. శనివారం నగరపాలక సంస్థలో ఆర్‌ఐ పద్మలత, ఇంజినీరింగ్ సిబ్బంది విజయ్‌కుమార్, రామయ్య, పారిశుధ్య కార్మికురాలు నాగమ్మ ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా వారికి సన్మాన సభ ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథి మేయర్ వసీం వారిని ఘనంగా సన్మానించారు. వారి శేష జీవితం సంతోషంగా సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, అదనపు కమిషనర్ శ్రీహరి బాబు, ఆర్‌ఓలు సతీష్, సుజాత, ఆర్‌ఐలు మురళి, వేణుగోపాల్, బాబు, సీసీలు శ్రీకాంత్, ఉదయ్, తదితరులు పాల్గొన్నారు.

పూడికతీత వేగవంతం చేయాలి


కాలువను పరిశీలిస్తున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని ప్రధాన మురుగు కాలువల్లో (మెయిన్ డ్రెయిన్) పూడికతీత వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజారోగ్యాధికారులు, ఇంజినీర్లను మేయర్ వసీం ఆదేశించారు. శనివారం నగరంలోని పాతూరు చెరువుకట్ట వెళ్లే మార్గంలో డ్రెయినేజీలో జరుగుతున్న పూడికతీత పనులను మేయర్ పరిశీలించారు. మెయిన్ డ్రెయినేజీలో పూడిక పేరుకుపోవడంతో మురుగు, వర్షపు నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారిందన్నారు. ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసి.. చెత్త, పూడికతీత పనులు పూర్తి స్థాయిలో చేపట్టాలని అధికారులకు సూచించారు. కాలువలపై ఆక్రమణలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. మేయర్ వెంట డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, కార్పొరేటర్లు లక్ష్మీదేవి, కమల్‌భూషణ్, ఎంహెచ్‌ఓ విష్ణుమూర్తి, ఏసీపీ హరిప్రసాద్, డీఈ శేఖర్, ఏఈ విజయ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు సుబ్బయ్య, గంగాధర్, రవి, శీన, గౌరి, రాజా, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు


సిబ్బందికి సూచనలిస్తున్న అదనపు కమిషనర్ శ్రీహరిబాబు

అనంతపురం కార్పొరేషన్: పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని అదనపు కమిషనర్ శ్రీహరిబాబు సూచించారు. శనివారం నగరంలోని 3, 6 రోడ్లు, సూర్యనగర్ ప్రాంతంలో అదనపు కమిషనర్ పర్యటించారు. చెత్తను ఎప్పటికప్పుడు కంపోస్టు యార్డుకు తరలించాలన్నారు. రోడ్డుపై చెత్త కన్పించకూడదన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా స్ప్రేయింగ్ రెగ్యులర్‌గా చేయాలన్నారు.